సాక్షి
చిత్తూరు
ఆదివారం । 8 । అక్టోబర్ । 2023



కాణిపాకం..పుష్ప సోయగం
కాణిపాకం వినాయక ఆలయాన్ని విదేశీ పుష్పాలు, విశేష ఫలాలతో సుంద రంగా అలంకరించారు. - 8లో



సుస్థిర అభివృద్ధి సాధనే లక్ష్యం
సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు మానిట రింగ్ కమిటీ అధికారులకు శిక్షణ ఇవ్వాలని జేసీ శ్రీనివాసులు తెలిపారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	33	23
తిరుపతి	35	25
తిరుమల	30	21
గూడూరు	37	27
నగరి	34	25

న్యూస్‌రీల్

బడిఈడు పిల్లలు బడుల్లోనే ..


వెంకటరమణారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని బడిఈడు పిల్లలను బడుల్లో చేర్పించేలా పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు జిల్లా సమగ్రశిక్ష శాఖ ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఈ విద్యాసంవత్సరంలో డ్రాపౌట్స్ విద్యార్థులను నూరు శాతం బడుల్లో చేర్పించేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో వలంటీర్లతో డ్రాపౌట్స్‌ను గుర్తించేందుకు ప్రత్యేకంగా సర్వే సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్వేలో నమోదయ్యే డ్రాపౌట్స్‌ను బడుల్లో చేర్పించేలా పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

9 ఈసీఆర్‌పీ భవనాలకు టెండర్లు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో ఎమెర్జెన్సీ కోవిడ్ రెస్పాండ్స్ ప్లాన్ (ఈసీఆర్‌పీ) భవనాలు టెండర్ దశలో ఉన్నాయని పంచాయతీరాజ్ ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. చిత్తూరు ఎస్‌ఆర్‌పేట, జీడీనెల్లూరు మండలం ఆరిమాకులపల్లె, ఎస్‌ఆర్‌పురం, కుప్పం మండలంలో ఎస్.కొత్తపల్లె, రామకుప్పం, పలమనేరులోని పత్తికొండ, ఓగు, పూతలపట్టు, మాదిరెడ్డిపల్లె పీహెచ్‌సీ పరిధిలో వీటిని నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ఒక్కొక్క భవనం రూ.9.83 లక్షలతో నిర్మించేందుకు టెండర్లు పిలిచామన్నారు. ఆరు పడకలతో కోవిడ్ రోగులకు వైద్యం అందించేందుకు వీటిని నిర్మించనున్నట్లు వివరించారు.

అవకాశాలుంటే విముక్తి కల్పిస్తాం


మాట్లాడుతున్న జడ్జి కరుణకుమార్

చిత్తూరు అర్బన్: జైలులో ఉన్న ఆశ్రమవాసులకు (ఖైదీలు) అవకాశాలు ఉంటే విముక్తి కల్పిస్తామని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఐ.కరుణకుమార్ అన్నారు. శనివారం చిత్తూరు జిల్లా జైలులో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో జైల్ అదాలత్ నిర్వహించారు. జిల్లా నాలుగవ అదనపు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి బాబాజాన్, సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్‌మూర్తి లతో కరుణకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఆవేశంలో చిన్నచిన్న నేరాలు చేసి నేరస్తులుగా జైలు జీవితం గడుపుతున్న వారి కేసులు విచారణ జరిగేటప్పటికీ సంవత్సరాలు గడిచిపోతాయని తెలిపారు. ఆశ్రమవాసులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు అన్ని వర్తిస్తాయన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాలోని జైళ్లలో జైల్ అదాలత్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ అదాలత్‌లో నేరం ఒప్పుకుంటే కేసుల నుంచి విముక్తి చేసేందుకు న్యాయమూర్తులు చర్యలు తీసుకుంటారన్నారు. జైలు నుంచి బయటకు వెళ్లిన తర్వాత నేరాలకు దూరంగా ఉండాలని కరుణకుమార్ సూచించారు. జిల్లా జైలు జైలర్ ఏ.శంకర్ రావ్, కోర్టు, జైల్ సిబ్బంది పాల్గొన్నారు.


బుక్‌లెట్లు విడుదల చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

జగన్‌తోనే అభివృద్ధి

'రాష్ట్రంలో అన్ని వర్గాల వారికి సంక్షేమం అందాలన్నా.. అన్ని రంగాలు అభివృద్ధి పథంలో పరుగులు తీయాలన్నా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో సారి సీఎం కావాల్సిన అవసరం ఉంది. ఈ నినాదంతో ఇంటింటికీ వెళ్లి అభివృద్ధి పథకాలు..సంక్షేమాన్ని వివరించాలి. ప్రతిపక్షాల మోసాలు, కుట్రలను ఎండగట్టాలి' అని పార్టీ శ్రేణులకు రాష్ట్ర విద్యుత్, అటవీ, పర్యావరణ, గనులశాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దిశనిర్దేశం చేశారు. 75 ఏళ్లలో జరగని అభివృద్ధి జగనన్న నేతృత్వంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసి చూపిందని తెలిపారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమాన్ని అందిస్తూ, గ్రామాలలో మౌలిక వసతులతో పాటు ఇంటి వద్దకే వైద్యాన్ని, ప్రభుత్వ సేవలను అందిస్తున్నామని, గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థతో పారదర్శక సేవలను అందిస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నట్లు తెలిపారు.

- కరోనాలో కూడా ఆగని పథకాలు
- సంక్షేమం, అభివృద్ధిని ఇంటింటికీ వివరించాలి
- వందపేజీల మేనిఫెస్టోతో బాబు మోసం
- పార్టీశ్రేణులకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దిశా నిర్దేశం

పుంగనూరు: ఆంధ్ర రాష్ట్రానికి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఎందుకు కావాలి ..ఆయన సేవలు మనకు ఎంతో అవసరం అనే నినాదంతో పార్టీశ్రేణులు ఇంటింటికీ వెళ్లి వివరించాలని మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. శనివారం తిరుపతిలో పుంగనూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' సమావేశాన్ని నిర్వహించారు. మొదటగా 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' పుస్తకాలను విడుదల చేశారు. మండలాల వారీగా ప్రజాప్రతినిధులు, నాయకులతో పార్టీ స్థితిగతులను చర్చించారు. వారి సలహాలు, సూచనలు స్వీకరించారు. మంత్రి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కరోనా కష్టకాలం ఎదురైనా ప్రజలకు అండగా నిలబడిందని తెలిపారు. దేశంలో ఎక్కడా జరగని విధంగా రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థ, వలంటీర్లు మొక్కవోని దీక్షతో కరోనా రోగులకు సేవలు అందించారని కొనియాడారు. చంద్రబాబునాయుడు ఆ సమయంలో రాష్ట్రం వైపు కన్నెత్తి కూడా చూడలేదన్నారు. అలాంటి కష్టకాలంలో కూడా నవరత్నాలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. ప్రతి ఇంటికీ సంక్షేమం రూపంలో రూ.లక్షల లబ్ధి అందిందని పేర్కొన్నారు. 2014లో వందపేజీల మ్యానిఫెస్టోతో చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రజలను మోసగించారని ఆరోపించారు. వెబ్‌సైట్ నుంచి మేనిఫెస్టోను మాయం చేశారని విమర్శించారు. తమ ప్రభుత్వం 99శాతం మేనిఫెస్టోను అమలు చేసిందని పేర్కొన్నారు. ఈ విషయాలను ప్రతి కుటుంబం వద్దకు వెళ్లి వివరించి, చైతన్యపరచాలన్నారు. పేదరికమే ప్రామాణికంగా, కులమతాలకు, పార్టీలకు తావులేకుండ ప్రభుత్వ పథకాలను ప్రజల ముంగిటే అందించిన విషయాలను ప్రజలకు వివరించాలన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండవ సారి ముఖ్యమంత్రిగా చేసేలా మద్దతు కోరాలని తెలిపారు. ఈ సమావేశంలో టీటీడీ బోర్డు మాజీ మెంబరు పోకల అశోక్‌కుమార్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, ఏకరి కార్పొరేషన్ చైర్మన్ మురళీధర్, జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, నియోజకవర్గ పరిశీలకుడు జింకా వెంకటాచలపతి, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పార్టీ విజయం కోసం పనిచేయాలి

పార్టీ పదవుల్లో ఉన్న ప్రతి ఒక్కరు వైఎస్సార్ సీపీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రజాప్రతినిధులతో కలసి పని చేయాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచించారు. ఈ మేరకు పార్టీ నేతలు ఆయా మండలాల్లో పర్యటించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఈసారి ఎన్నికలు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జరుగుతాయని పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా పని చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరించి, ఓట్లు అడగాలని సూచించారు. కలసికట్టుగా సైనికుల్లా పనిచేయాలన్నారు. కష్టపడి పని చేసే వారికి తగిన గుర్తింపు లభిస్తుందని స్పష్టం చేశారు.


హాజరైన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు

మహిళను అవమానిస్తే పుట్టగతులుండవు

- మంత్రి రోజాకు బండారు క్షమాపణ చెప్పాలి
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి



కార్వేటినగరం: భారత దేశం పవిత్రంగా భావించే మహిళా శక్తిని అవమానించిన వారికి పుట్టగతులు ఉండవని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రతి ఒక్కరి విజయం వెనుక ఒక మహిళ అండగా ఉంటుందని, అలాంటి శక్తిని అవమానిస్తున్న ప్రతి పక్షాలకు తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. మంత్రి రోజా వ్యక్తిత్వంపై దాడి చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. అతనికి తల్లి, చెల్లి ఉంటే ఇలాంటి మాటలు మాట్లాడరని, ఇలాంటి వ్యాఖ్యలు తన కుటుంబ సభ్యులపై చేస్తే ఊరుకుంటారా అని ప్రశ్నించారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించిన సమాజంలో ఇలాంటి నీచసంస్కృతి ఉండే వారికి కఠిన శిక్ష వేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ రాజకీయ సంస్కృతి ఇంతేనని, గతంలో చంద్రబాబు రోజమ్మను అసెంబ్లీకి రాకుండా చేసి ఘోరంగా అవమానించి కన్నీళ్లు పెట్టించారని, ఆ ఫలితం నేడు జైలులో అనుభవిస్తున్నారని విమర్శించారు. మహిళలను ఎవ్వరు అవమానించినా ఇదే పరిస్థితేనని హెచ్చరించారు. స్త్రీ ఒక దేవత లాంటిదని, గౌరవించడం మన బాధ్యత అన్నారు. బండారుకు నిజమైన వ్యక్తిత్వం ఉంటే మంత్రి రోజాకు క్షమాపణ చెప్పాలని హితవు పలికారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించిన ప్రధాని మోదికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజారోగ్యంలో దేశానికే ఆదర్శం


వైద్య శిబిరంలో హెల్త్ కార్డు పంపిణీ చేస్తున్న మంత్రి రోజా

- జగనన్న సురక్ష ప్రజలకు వరం
- పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా

పుత్తూరు రూరల్: ప్రజలకు ఆరోగ్య సేవలందించడంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా నిలుస్తోందని, ఈ ఘనత సాధించిన ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని పర్యాటక, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి ఆరోగ్యం కోసం దేశ చరిత్రలో ఇప్పటి వరకు లేని విధంగా ప్రవేశ పెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు వరమని తెలిపారు. శనివారం వడమాలపేట మండలం ఎస్‌వీపురంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మంత్రి రోజా పాల్గొని ప్రసంగించారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద నాలుగేళ్లలో రూ.8,845 కోట్లతో 1.40 కోట్ల కుటుంబాలకు ఉచిత వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. వైఎస్సార్ కంటి వెలుగు పథకం కింద ఉచిత చికిత్సలతో పాటు అద్దాల పంపిణి కోసం రూ.13 కోట్లు కేటాయించినట్లు వివరించారు. రాష్ట్రంలో 10,032 వైఎస్సార్ విలేజ్ క్లీనిక్‌లను, 542 వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు తెలిపారు. చికిత్స తర్వాత విశ్రాంతి సమయంలో వైఎస్సార్ ఆరోగ్య ఆసరా కింద రూ.1004 కోట్లతో 16.19 లక్షల మందికి లబ్ధి చేకూరినట్లు వివరించారు. 108 సేవల కింద 768 అత్యవసర అంబులెన్స్‌లు, 910 మొబైల్ క్లినిక్ అంబులెన్స్‌లు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. వైద్య చదువుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా రూ.8 వేల కోట్ల ఖర్చుతో కొత్తగా 17 మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం కోసం నాలుగేళ్లలో రూ.6,687 కోట్లతో 35 లక్షల మందికి లబ్ధి చేకూరిందని వివరించారు. వైద్య శాఖలో డాక్టర్ల నుంచి నర్సుల వరకు 50 వేలకు పైగా నియామకాలు జరిగినట్లు వెల్లడించారు. అనంతరం హెల్త్ కార్డులు, కంటి అద్దాలను పంపిణి చేశారు. తహసీల్దార్ సుబ్రమణ్యం, వైద్యాధికారి చక్రపాణి, ఎంపీపీ విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్రమణ్యంరెడ్డి, సురేష్‌రాజు, నందయ్య, శేఖర్, దొరస్వామి, మునిబాబు, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

పుష్పపల్లకి.. భక్తుల పరవశం

కాణిపాకం స్వయంభు శ్రీవరసిద్ధి వినాయక స్వామి ప్రత్యేక ఉత్సవాల్లో శనివారం రాత్రి శ్రీసిద్ధి, బుద్ధితో కలసి పుష్పపల్లకిలో పార్వతీ తనయుడు విహరించారు. పుష్పపల్లకి సేవను తిలకించేందుకు అశేషంగా భక్తులు తరలి వచ్చారు. విద్యుద్దీపాలంకరణలు, మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు, సాంస్కృతిక ప్రదర్శనల నడుమ పుష్ప పల్లకిసేవ నయనానందకరంగా సాగింది.


పుష్ప పల్లకి ఊరేగింపు (ఇన్‌సెట్) శ్రీసిద్ధి,బుద్ధి సమేతంగా విశేషాలంకరణలో స్వామివారు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవినాయక స్వామి ప్రత్యేక ఉత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. శనివారం రాత్రి పుష్పపల్లకి ఉత్సవానికి భక్తులు పోటెత్తారు. వేకువ జామున ఆలయంలోని మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేక పూజలు, అలంకరణలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. వారంతపు సెలవు రోజులు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి అలంకార మండపంలో శ్రీసిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. తదుపరి సర్వాంగ సుందరంగా అలంకరించి ఊరేగింపుగా తీసుకొచ్చి సుగంధ పుష్పాలంకరణలు, విద్యుద్దీపాలతో ధగధగలాడుతున్న పల్లకిలో కొలువు దీర్చి పూజలు చేశారు. అనంతరం పురవీధుల్లో పుష్ప పల్లకి ఊరేగింపు వైభవంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించి, స్వామివారిని దర్శించి తరించారు. ఈఓ వెంకటేశు, ఆలయ తాజా మాజీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, పాల్గొన్నారు. డీఎస్పీ శ్రీనివాసమూర్తి, వెస్ట్ సీఐ రవిశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు.


పుష్కరిణిలో కనువిందు చేసిన ఆలయ ప్రతిబింబం

నేడు తెప్పోత్సవం

ప్రత్యేక ఉత్సవాల్లో ఆదివారం ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు ఉంటాయి. రాత్రి పుష్కరణిలో తెప్పోత్సవం నిర్వహించనున్నట్లు ఈఓ వెంకటేశు తెలిపారు. పుష్కరిణి చుట్టూ విద్యుద్దీపాలంకరణలు ధగధగలాడుతున్నాయి. పుష్కరిణి జలాల్లో విద్యుద్దీపకాంతుల ఆలయ ప్రతిబింబం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. శనివారం సాయం సంధ్య ఈదృశ్యం భక్తులను కనువిందు చేసింది.

పేకాట స్థావరంపై దాడి: 9 మంది అరెస్టు

రామకుప్పం: మండలంలోని కెంచనబల్ల తోట్లచెరువు సమీపంలో శుక్రవారం రాత్రి పేకాట స్థావరంపై కుప్పం రూరల్ సీఐ ఈశ్వర్‌రెడ్డి, గుడుపల్లె ఎస్‌ఐ లక్ష్మీకాంత్ రామకుప్పం పోలీసులతో కలసి దాడి చేశారు. ఈ దాడిలో రూ.1.48 లక్షల నగదు,12 మొబైల్ ఫోన్లు, 9 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతున్న 9 మందిని అరెస్టు చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ మురళీబాబు తెలిపారు.

కాణిపాకం.. పుష్ప,ఫల సోయగం


విమాన గోపురం వద్ద పుష్పాలంకరణ

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి ప్రత్యేక ఉత్సవాల్లో శనివారం రాత్రి పుష్పపల్లకి సందర్భంగా ఆలయాన్ని విదేశీ పుష్పాలు, పలు రకాల ఫలాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆన్వేటి మండపం, సుపథ మండపం, ధ్వజస్తంభం, ఆలయ పరిసరాలు, ఆలయ విమాన గోపురం విదేశీ పుష్పాలు, పుష్ప తోరణాలతో శోభాయమానంగా భక్తులకు కనువిందు చేశాయి. స్వామివారి ఉత్తర ద్వారం, ఆలయం లోపల పలు రకాల ఫలాల అలంకరణలు కట్టిపడేశాయి.


సుపథ మండపంలో..


ఆలయం లోపల ఫలాలతో..


అన్వేటి మండపంలో..


విదేశీ పుష్పాలంకరణతో ధ్వజస్తంభం

సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనే లక్ష్యం

చిత్తూరు కలెక్టరేట్ : సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు ఈనెల 10వ తేదీన డివిజన్ స్థాయి వర్క్‌షాప్‌ల నిర్వహణకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని అధికారులను జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. ఆయన శనివారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు డివిజన్, మండల స్థాయి మానిటరింగ్ కమిటీలో అధికారులకు శిక్షణ ఇవ్వాలన్నారు. ఈనెల 10వ తేదీ ఉదయం పది గంటలకు పలమనేరు డివిజన్‌కు మదర్‌థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాలలో, కుప్పం డివిజన్‌కు మధ్యాహ్నం 2.30 గంటలకు కుప్పం ఎంపీడీవో కార్యాలయంలో జరిగే శిక్షణ కార్యక్రమాలకు జెడ్పీ సీఈవో ఇన్‌చార్జిగా వ్యవహరించాలన్నారు. నగరి డివిజన్‌కు ఉదయం 10 గంటలకు నగరి వెలుగు కార్యాలయంలో, చిత్తూరు డివిజన్‌కు మధ్యాహ్నం 2.30 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించే కార్యక్రమాలకు డీపీవో లక్ష్మి ఇన్‌చార్జిగా వ్యవహరించాలని ఆదేశించారు. డివిజన్ లెవల్ మానిటరింగ్ కమిటీకి డీఎల్‌డీవో చైర్మన్‌గా, ఆయా శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారని చెప్పారు. మండల స్థాయి డేటా వాలిడేషన్ కమిటీకి ఎంపీడీవో చైర్మన్‌గా, మండల స్థాయి అధికారులు సభ్యులుగా ఉంటారని తెలిపారు. పరిసరాల పరిశుభ్రత కార్యక్రమంలో గ్రామాల్లోని చెత్తదిబ్బలు, అపరిశుభ్రంగా ఉండే పరిసరాలను, నీటి నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి జగనన్న స్వచ్ఛ సంకల్పం యాప్‌లో ఫొటోలను అప్‌లోడ్ చేయాలన్నారు. డీఎంఅండ్‌హెచ్‌వో ప్రభావతి, డీఎల్‌డీవో రవికుమార్ పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి

శాంతిపురం: కొలమడుగు పంచాయతీ కొత్తూరులో 11 ఏళ్ల బాలికపై అత్యాచారం జరిగినట్టు తండ్రి రాళ్లబూదుగూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే గ్రామానికి చెందిన హేమంత్ అనే యువకుడు శుక్రవారం మధ్యాహ్నం ఈ అఘాయిత్యానికి పాల్పడినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. రాత్రి ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసి, బాలికను వైద్యం కోసం కుప్పం ప్రాంతీయ వైద్యశాలకు తరలించినట్టు ఎస్‌ఐ మునస్వామి తెలిపారు.

ఇన్‌స్పైర్ జాతీయ పోటీలకు ఎంపిక


జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు ఢిల్లీకి వెళ్తున్న విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు 2021–22 విద్యా సంవత్సరంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఎనిమిది పాఠశాలల సైన్స్ ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. ఢిల్లీలో ఈనెల 9 నుంచి 11 వరకు జాతీయ స్థాయి పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలకు శనివారం చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల నుంచి 8 పాఠశాలల విద్యార్థులు, వారికి గైడ్‌గా వ్యవహరించే టీచర్లు, మెంటార్ జీడీ నెల్లూరు జెడ్పీ హైస్కూల్ బయాలజీ టీచర్ మురళి ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని డీఈవో విజయేంద్రరావు, ఏపీసీ వెంకటరమణారెడ్డి, డీవైఈవో చంద్రశేఖర్, సైన్స్ ఆఫీసర్ వెంకటరమణ ఆకాంక్షించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి


మృతి చెందిన రాంనారాయణ్


మృతి చెందిన శివకుమార్ ఆచారి

రొంపిచెర్ల: పీలేరు–రొంపిచెర్ల మార్గంలోని బండకిందపల్లె విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడి ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఎస్‌ఐ కథనం మేరకు వివరాలు.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అజయ్(29), రాంనారాయణ్ (30) ఇళ్లలో పీవోపీ పని చేస్తు జీవనం సాగిస్తున్నారు. వీరు నెల్లూరు నుంచి శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై పీలేరుకు వెళ్లుతుండగా, బండకిందపల్లె విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురుగా అదుపు తప్పి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో ఇరువురు గాయ పడ్డారు. రాంనారాయణ్ పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో చికిత్స కోసం 108లో అన్నమ్మయ్య జిల్లా పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాంనారాయణ్(30) మృతి చెందాడు. రొంపిచెర్ల పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు.

పెద్దపంజాణి మండలంలో..

పెద్దపంజాణి: ద్విచక్ర వాహనం అదుపుతప్పి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని అప్పినపల్లి–పుంగనూరు మార్గమధ్యంలోని పెద్దవెలగటూరు క్వారీ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసులు కథనం.. గంగవరం మండలం బొమ్మనపల్లెకు చెందిన నాగభూషణాచారి కుమారుడు శివకుమార్ ఆచారి(25) అప్పినపల్లెలో వెల్డింగ్ షాపు నిర్వహిస్తున్నాడు. శనివారం ఉదయం పుంగనూరు సమీపంలో ద్విచక్ర వాహనంలో వెళుతుండగా పెద్దవెలగటూరు క్వారీ సమీప మలుపులో చెట్టును బలంగా ఢీ కొన్నాడు. ఈప్రమాదంలో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని ర్చానికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మా కోసం జగనన్న మళ్లీ సీఎం కావాలి


తిరుమలకు కాలినడకన వెళ్తున్న శ్రీబొమ్మరాజుపురం గ్రామస్తులు

పాలసముద్రం : పేదలు ఆర్థికంగా ఎదగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని శ్రీబొమ్మరాజుపురం గ్రామస్తులు అన్నారు. మళ్లీ జగన్ సీఎం కావాలని శ్రీవేంకటేశ్వరస్వామివారిని కోరుతూ వారు తిరుమలకు కాలినడకన మొక్కు తీర్చుకునేందుకు బయలుదేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో పాటు మరిన్ని సంక్షేమ పథకాలు అందించారని, తమలాంటి పేదలకు వెన్నుదన్నుగా నిలిచారని కొనియాడారు. పథకాలు పారదర్శకంగా అందుతున్నాయని తెలిపారు. తాము గ్రామంలో ఇళ్లు లేక ఎన్నో ఏళ్లు ఇబ్బందులు పడ్డామని, జగనన్న సీఎం అయ్యాక ఇంటి స్థలంతో పాటు ఇళ్లు కట్టించి ఇచ్చారని ఆనందం వ్యక్తం చేశారు. తమలాంటి పేదలు బాగుండాలంటే మళ్లీ జగనన్న సీఎం కావాలని తెలిపారు.

వైఎస్సార్ బీమా రూ.5 లక్షల చెక్కు పంపిణీ


చెక్కు అందజేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

చౌడేపల్లె: మండలంలోని దుర్గసముద్రం గ్రామానికి చెందిన తోటి చిన్నక్కకు రూ.5 లక్షల వైఎస్సార్ బీమా చెక్కును మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శనివారం అందజేశారు. స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి బాధితురాలు చిన్నక్క తిరుపతిలోని మంత్రి పెద్దిరెడ్డిని స్వగృహంలో కలిశారు. నెల కిందట చిన్నక్క మనుమడు శ్రీనివాసులు ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందాడు. ప్రభుత్వం నుంచి మంజూరైన వైఎస్సార్ బీమా చెక్కును బాధితురాలు చిన్నక్కకు అందజేశారు. ఏకష్టమొచ్చినా తామున్నామంటూ మంత్రి భరోసా ఇచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, ఉప సర్పంచ్ కృష్ణంరాజు, నేతలు చెంగారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అమర, శ్రీనివాసులు,ఆర్.కృష్ణప్ప, టీచర్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.